విజయవాడలో సిఎం చంద్రబాబు నాయుడు నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు చెరుకూరి శ్రీధర్, చామకూరి శ్రీధర్

సాగునీటి సంఘాల ఎన్నికలకు కౌంట్‌డౌన్

ఎట్టకేలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

రహస్య బ్యాలెట్ ఎన్నికకు ప్రాధాన్యత

కడపలో 206, అన్నమయ్యలో 94 సంఘాలు

14న చెరువులకు ఎన్నిక

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కౌంట్‌డౌన్ మొదలైంది. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన నీటిపారుదల శాఖ ఆయా కలెక్టర్ల ఆదేశాల మేరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లా ఇరిగేషన్, రెవెన్యూ అధికార యంత్రాంగాలు ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాయి. ఈ నెల 14న చెరువులకు, 17న డిస్ట్రిబ్యూటరీలకు రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహణలో నిమగ్నమైంది. ఉమ్మడి జిల్లాలకు చెందిన 300 చెరువుల కింద పంటలు సాగు చేస్తున్న రైతుల సభ్యత్వ నమోదు దగ్గర నుంచి ఎన్నికల అధికారుల నియామకం, ఎన్నికల నిర్వహణపై అవ గాహన కల్పించడం వంటి చర్యలతో ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థా యిలో సిద్ధమైంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. జిల్లా నీటిపారుదల శాఖ, రెవెన్యూ యంత్రాంగాలు పరస్పర సమన్వయంతో ఎన్నికల అధికారుల శిక్షణ తరగతుల దగ్గర నుంచి రైతుల సభ్యత్వాలు, కౌంటింగ్ తీరుతెన్నుల వరకు ఎన్నికల ప్రక్రియకు అవసరమైన సరంజామాతో సిద్ధమయ్యాయి. బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం గమనార్హం. కడప జిల్లాలో 206, అన్నమయ్య జిల్లాలో 94 సాగునీటి సంఘాలు ఉన్నాయి. జిల్లా సాగునీటి పారుదలశాఖ పరిధిలో ఆరు ఇరిగేషన్ సర్కిల్స్ పరిధిలోని మైనర్ 112, మీడియం 16, మేజర్ 78 వెరసి 206 సాగునీటి సంఘాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద 94 సాగునీటి సంఘాలు ఉన్నాయి. 2015లో అప్పటి టిడిపి సర్కారు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం తెలిసిందే. సుమారు పదేళ్లుగా సాగునీటి సంఘాలు మనుగడలో లేకపోవడంతో రైతుల్లో ఉత్సాహం కొరవడినట్లు కనిపిస్తోంది.

ఎట్టకేలకు నోటిఫికేషన్

ఎట్టకేలకు బుధవారం సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అక్టోబర్, నవంబర్ మాసాల్లో రెండు దఫాలుగా ఎన్నికల తేదీలు వాయిదా పడడంతో ఎన్నికల నిర్వహణపై నిరుత్సాహం నెలకొంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల నీటి పారుదలశాఖ మంత్రి ఎన్నికల నిర్వహణ తేదీలను ప్రకటించడంతో జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది. ఇప్పటికే ఆయా మండలాల వారీగా చెరువులు, రైతుల సభ్యత్వాల జాబితాలతో సిద్ధమై ఉన్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. చెరువుల జాబితా రూపకల్పన అనం తరం ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీరింగ్ స్థాయి అధికారులను నియా మకాలను పూర్తి చేసింది. వీరికి అనుబంధంగా ఆయా మండలాలకు చెందిన తహశీల్దార్ స్థాయి అధికారుల నియామకాలతో సిద్ధం కావడం గమనార్హం.

పారదర్శక ఎన్నికలు సాగేనా!

2015లో నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికల ఫలితాల ప్రకటనలో పారదర్శకత కొరవడిన సంగతి తెలిసిందే. అప్పటి సాగునీటి సంఘాల ఎన్నికలను అధికార పార్టీ మెజార్టీ సంఘాలను ఏకగ్రీవం చేసుకుందనే ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఒంటిమిట్ట సాగునీటి సంఘ ఎన్నికపై ప్రత్యర్థులు కోర్టును ఆశ్రయించిన ఘటనలు ఉన్నాయి. తాజా సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో అప్రజాస్వామిక పోకడలు పునరావృతం గాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో తాజాగా రాష్ట్రప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల్లో రహస్య బ్యాలె ట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహణకు మొగ్గు చూపింది.

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తాం

సాగునీటి సంఘాలకు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం రహస్య బ్యాలెట్ విధానానికి మొగ్గు చూపించడంతో అనైతికతకు ఆస్కారం లేకుండా పోయింది.

- కె.శ్రీనివాసులు, ఎస్ఇ, ఇరిగేషన్, కడప.

కేంద్ర ప్రభుత్వ చర్యలను ఖండించండి

- ధర్నాలో ప్రజా సంఘాల నాయకులు

అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కేరళ పట్ల వివక్ష చూపుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ చర్యలు ఖండించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మోడీ సర్కార్ కేరళలోని వామపక్ష ప్రభుత్వానికి అనేక ఆటంకాలు, అడ్డంకులు కల్పిం స్తున్నదని, చట్టపరంగా రావాల్సిన నిధులు విడుదల చేయలేదని అందుకు నిరసనగా కేంద్ర కమిటీ పిలుపు మేరకు కేరళ ప్రభుత్వానికి సంఘీభావంగా కడప అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, దస్తగిరిరెడ్డి, అన్వేష్, శ్రీనివాసులురెడ్డి, గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ గవర్నర్‌ను అడ్డం పెట్టుకుని రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తొక్కిపెడుతున్నారని తెలిపారు. భారత రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తి విఘాతం కల్పిస్తున్నదన్నారు. అత్యంత బలీయమైన సహకార రంగం ఉన్న కేరళ రాష్ట్రంలో ఈ రంగాన్ని నాశనం చేయడానికి కేంద్రం కంకణం కట్టుకుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని భారత పెట్రోలియం లాంటి భారీ పరిశ్రమలను అమ్మడానికి పూనుకుందని విమర్శించారు. దీనిపై కేరళలో సంవత్సరం పైగా పెద్ద ఎత్తున ఆందోళన సాగిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిందని చెప్పారు. త్రివేంద్రం విమానాశ్రయాన్ని అదానికి అప్పగించిందని తెలిపారు. ప్రభుత్వమే కొంటామన్నా ప్రభుత్వానికి అప్పగిం చడానికి నిరాకరించిందని పేర్కొన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో కేసు వేసిందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వయనాడ్ కొండ చర్యలు విరిగిపడి నాలుగు వందల మంది మరణించారని పేర్కొన్నారు. మరో వంద మంది నేటికీ లభ్యం కాలేదని చెప్పారు. ఇటువంటి తీవ్రమైన దుర్ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలి కానీ కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సహకారం అందించకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కేరళ పట్ల వివక్ష తీవ్ర స్థాయిలో కొనసాగుతున్నదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను దేశవ్యాప్తంగా ప్రజలందరూ ఖండించాలని కోరుతున్నామన్నారు. కేరళ రాష్ట్రం దేశంలోనే అక్షరాస్యతలో అగ్ర స్థానంలో ఉందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అత్యధిక కాలం వామపక్షాలు అధికారంలో ఉన్నాయని చెప్పారు. ఇక్కడి ప్రజల చైతన్యం మెండు, రాష్ట్రంలోని పరిమిత వనరులతోనే సర్వతోముఖాభివృద్ధి సాధించారని పేర్కొన్నారు. కేరళలో కనీస వేతనం రోజుకు రూ.600 కానీ, అత్యధిక కార్మికులు రోజుకు రూ.1000కి పైగా వేతనం పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో 30 రకాల వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేసి అన్ని రంగాల కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. 13 రకాల నిత్యావసర సరుకులు ప్రజలకు అతి తక్కువ ధరకు అందిస్తున్నారని పేర్కొన్నారు. కోవిడ్ కాలంతో సహా పిల్లలకు విద్యను అందించడంలో దేశంలోనే అగ్ర భాగంలో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సొంత గృహం వామపక్ష పార్టీల కాలంలో ఏర్పాటు చేశారని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులను కూడా అతిధిగా భావించి వారికి రాష్ట్రంలోని ఇతర ప్రజల్లాగా అన్ని వసతులు సమకూర్చారని పేర్కొన్నారు. రైతులకు దేశంలోనే అత్యధిక గిట్టుబాటు ధరను అందిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత చర్యలు విరమించి చట్ట ప్రకారం రావాల్సిన హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనకు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, నగర కార్యదర్శి రామ్మోహన్ పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ధర్నాలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసయ్య, రమణ, సురేష్, సిఐటియు నాయకులు గోవిందు, యువజన విద్యార్థి సంఘం నాయకులు విజయ్, రవి పాల్గొన్నారు.

'కుడా' చైర్మన్‌గా 'ముక్కా' ప్రమాణ స్వీకారం

ముక్కా రూపానందరెడ్డితో ప్రమాణస్వీకారం చేయిస్తున్న జెసి అదితి సింగ్

ప్రజాశక్తి-కడప అర్బన్ : కడప అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా ముక్కా రూపానందరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. కడప నగరంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం జెసి అదితి సింగ్ రూపానందరెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు అధికారులు, నాయకులు చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువా, బొకేలతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ చిన్న పరిశ్రమలు శాఖ చైర్మన్ కస్తూరి కోటేశ్వర నాయుడు, ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, రామచంద్రయ్య, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, ఎసి కార్పొరేషన్ డైరెక్టర్ అనితా దీప్తి, జనసేన రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, టిడిపి సంస్కృతి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, బిజెపి పార్లమెంట్ అధ్యక్షులు సాయిలోకేష్, చిట్వేలి మాజీ ఉపాధ్యక్షులు గుండయ్య నాయుడు, ఓబులవారిపల్లె మాజీ ఎంపిపి వేంకటేశ్వరరాజు, లాయర్ గుర్రప్ప, రాజుకుంట సర్పంచ్ గుత్తి నర్సింహులు, మన్నూరు నారాయణ నాయుడు, ముక్కా కుటుంబ సభ్యులు ముక్కా వరలక్ష్మి, ముక్కా సాయివికాస్‌రెడ్డి, టిడిపి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షోరూంను ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ చంద్రమోహన్

విద్యుత్ వాహనాలతో కాలుష్య నివారణ : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-గోపవరం

విద్యుత్ ఆధారిత వాహనాలతో కాలుష్యాన్ని నివారించవచ్చని ఆర్‌డిఒ చంద్రమోహన్ అన్నారు.బుధవారం బద్వేలు-నెల్లూరు రోడ్డులోని ఈజీ రైడ్ గ్రీన్ ఎలక్ట్రికల్ స్కూటర్ల షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వెహికల్స్ బ్యాటరీలపై ఇంకా రీసెర్చ్ జరుగుతోందన్నారు. భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత ధ్వని డాక్టర్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ భవిష్యత్తులో అన్ని వాహనాలు కూడా ఎలక్ట్రిక్ టెక్నాలజీ అమలు చేస్తే మన దేశం ఆర్థికంగా ఎంతో పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. షోరూం అధినేత షేక్ అన్వర్ బాషా, స్పెషలిస్ట్ టెక్నీషియన్ కొప్పరపు సూర్య అతిథులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో విశ్రాంత జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ డి.మార్కారెడ్డి, బిసి సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తి, బద్వేల్ పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు, వైభవ్ ప్రసాద్, మాజీ సర్పంచ్ వెంకటరమణ యాదవ్, బాలాజీ గ్రూప్స్ కె.వి.సుబ్బారావు, ఆవాజ్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ సత్తార్, మహబూబ్ బాషా, పెన్నవర్ల సంఘం ప్రతినిధి రామసుబ్బారెడ్డి, బిసి సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షులు సుభాన్‌బీ హాజరయ్యారు. ముఖ్య అతిధుల చేతుల మీదుగా తొలిమలి వాహనాలను నాగ సుధ,గౌస్ పీర్, ఖాజా హుస్సేన్‌లకు అందజేశారు.

పంటల బీమా నమోదు చేసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి-కమలాపురం టౌన్

రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు బీమా నమోదు చేసుకోవాలని ఎఒ సరస్వతి అన్నారు. బుధవారం మండలంలోని లేటపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో సాగులో ఉన్న పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన ప్రీమియం చెల్లించి స్వచ్ఛందంగా పంట బీమా నమోదు చేసుకోవాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల కారణంగా పంటకు దిగుబడి నష్టం జరిగినప్పుడు రైతును ఆర్థికంగా ఆదుకోవడానికి పంటల బీమా దోహదపడుతుందని ప్రతి రైతు పంట బీమా చేయించుకోవాలని తెలిపారు. మినుము, వేరుశనగ పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. వేరుశనగ పూత దశలో 200 కిలోల జిప్సంను ఒక ఎకరాకు వేయడం వలన అధిక దిగుబడిని సాధించవచ్చని తెలిపారు. సేంద్రియ ఎరువుల వాడటం వలన సూక్ష్మ ధాతు లోపాలను నివారించవచ్చని చెప్పారు. ఆరోగ్యవంతమైన పంటలను పండించడానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. ఆరోగ్య వంతమైన పంటలను పండించడానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఎంతో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గంగావతి, సోనీ, గ్రామ వ్యవసాయ సహాయకుడు వికాస్, రైతులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎఒ సరస్వతి

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు : డిసిసి

ప్రజాశక్తి - కడప

చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత ఏమాత్రం లేకుండా పోయిందని డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి ధ్వజమెత్తారు. హోంమంత్రి ప్రసంగాలు, విమర్శలు చేయడం వంటి వాటికే పరిమితమై పోయిందని, మహిళల రక్షణ కోసం ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు, బాలికలకు కనీసం భద్రత లేకుండా పోయిందని, వారిపై అత్యాచారాలు పెద్ద వెళ్ళిపోతున్న ప్రభుత్వం కనీసం స్పందించకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. నంద్యాల జిల్లా నందికొట్కూరులో 17 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి గురైన ఘటన, వైఎస్ఆర్ జిల్లా వేములలో ఓ మహిళపై హత్యాయత్నం ఘటనలు, తదితర ఉదంతాలు మహిళల భద్రతకు సంబంధించి ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయన్నారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని హెచ్చరిస్తూ, ప్రజాస్వామ్య విపక్షాలుగా కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బద్వేలు

మున్సిపల్ కార్మికుల సమస్యలు సరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కమిటీ కె.నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ అదనపు పారిశుధ్య సిబ్బందికి నాలుగు నెలల వేతనాన్ని మంజూరు చేసి, వారిని ఆప్కాస్ సంస్థలో చేర్చుటకు అవసరమగు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపి ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. కార్మికులకు కొబ్బరి నూనె, చెప్పులు, సబ్బులు, యూనిఫాం, టవల్స్‌ను ఇవ్వాలని, చెత్త తరలించు వాహనాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, చనిపోయిన ఆప్కాస్ కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎక్స్గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని, పట్టణ కార్యదర్శి ఎస్.కె.ఆదిల్, నాయకులు బాల గుర్రయ్య, రాజగోపాల్, బాబయ్య, ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్షులు జి.అనంతమ్మ, నాయకురాలు మస్తాన్ బీ, వృత్తిదారుల సంఘం నాయకులు జి.సుబ్బరాయుడు యూనియన్ పట్టణ అధ్యక్షులు పి.శ్యాంప్రవీణ్ వర్కింగ్ అధ్యక్షులు డి.హరి ప్రధాన కార్యదర్శి డి.నాగేంద్రబాబు కోశాధికారి కె.శివకుమార్, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

స్కిల్ డిజైర్ టెక్నాలజీస్‌తో వైవీయూ ఒప్పందం

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయం విద్యార్థుల ప్రయోజనార్థం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నట్లు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి వెల్లడించారు. కడప యోగివేమన విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని స్కిల్ డిజైర్ టెక్నాలిజాస్ ప్రైవేట్ సంస్థ మధ్య బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. విసి సమక్షంలో వైవీయూ రిజిస్ట్రార్ పి.పద్మ, స్కిల్ డిజైర్ సంస్థ సంచాలకులు శ్రీకాంత్ ముప్పాళ్ళ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఈ ఎంఒయు ద్వారా నైపుణ్యాభివృద్ధి కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు నిర్వహిస్తారన్నారు. మద్రాస్ ఐఐటి నోడలైజెన్సీగా వ్యవహరిస్తుందన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ అనుబంధ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అభివృద్ధి చేయడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ డీన్‌లు ఆచార్య ఎ.జి.దాము, కంకణాల గంగయ్య, స్వయంప్లస్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.పి.వెంకటరమణ, ఎంసిఎ సహ ఆచార్యులు డాక్టర్ బి.రెడ్డయ్య, మడా ఎం.శ్రీనివాసరావు, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ పి.సరిత, డాక్టర్ వి.ఆనూప్రసన్న, ఐక్యూఎసి సంచాలకులు డాక్టర్ ఎల్.సుబ్రమణ్యం శర్మ పాల్గొన్నారు.

జిఒ 145ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - కడప

జిఒ 145ను తక్షణం ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని కడప న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు, సీనియర్ న్యాయవాదులు హెచ్చరించారు. కడప నుండి తిరుపతికి ఫాస్ట్ ట్రాక్ కోర్టును బదిలీ చేయడాని నిరసిస్తూ జిల్లా కోర్టు ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. బుధవారం దీక్షలో కూర్చున్న న్యాయవాదులకు గురప్ప నాయుడు పూల మాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ 145ను న్యాయవాదులందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జిఒను రద్దు చేసేంత వరకు మా పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. దీక్షలో న్యాయవాదులు ఎ.సంపత్ కుమార్, కె.రామ కొండయ్య, బి.ఎన్.అక్బర్ అలీఖాన్, కె.భువన ఏకాదశరెడ్డి, జి.మంజునాథ్ కూర్చున్నారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కోటిరెడ్డి, రామసుబ్బమ్మ విగ్రహాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం కోటిరెడ్డి, కోటిరెడ్డి రామసుబ్బమ్మ విగ్రహాలను ప్రభుత్వ విప్ మాధవి, కోటిరెడ్డి వారసులు ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ జయభారత్‌రెడ్డి, డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ 1973లో కోటిరెడ్డి రామసుబ్బమ్మ, కోటిరెడ్డి మహిళల విద్యాభివృద్ధి కోసం కడప పట్టణంలో కళాశాలను స్థాపించారని పేర్కొన్నారు. 2023 నాటికి కళాశాలను స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2024, డిసెంబర్ 14న నిర్వహించే స్వర్ణోత్సవాల్లో భాగంగా ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఎమ్మెల్యే మాధవి చేతుల మీదుగా కళాశాలలో ప్రతిభ కలిగిన 18 మంది విద్యార్థులకు, కళాశాల హాస్టల్‌లో ఉంటున్న 20 మంది పేద విద్యార్థులకు మూడు సంవత్సరాలు హాస్టల్‌కి అయ్యే ఆర్థిక సహాయం, నగదు బహుమతిని అందించామని చెప్పారు. కోటిరెడ్డి, రామసుబ్బమ్మ స్వాతంత్ర సమరయోధులని, సేవాగుణం, దాతృత్వంగల మహనీయులని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కోసం భవిష్యత్తులో తమ వంతు సహాయ సహకారాలు తప్పకుండా అందిస్తామని చెప్పారు. బాలకొండ గంగాధర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ధైర్యంగా భారతదేశం ముఖ్యంగా రాయలసీమ జిల్లాల నుంచి పోరాడినయధుల్లో కోటిరెడ్డి ఒకరన్నారు. కార్యక్రమంలో కోటిరెడ్డి కుమారులు డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, జయభారత్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సుచరిత, పద్మావతమ్మ, హర్షవర్ధన్‌రెడ్డి, వివేకానందరెడ్డి, అశోక్‌రెడ్డి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులను పాల్గొన్నారు.

విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కోటిరెడ్డి వారసులు

జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకరులు

సీనియర్ హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - కడప

ఈ నెల 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు అనంతపురంలోని కళ్యాణదుర్గంలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ హాండ్‌బాల్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టును బుధవారం కడప జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి వి.వి.శివప్రసాద్ ప్రకటించారు. కడప నగరంలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం మైదానంలో జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎంపికల్లో జిల్లా నలుమూలల నుండి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మంచి ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికైన వారిలో ఎస్.చాంద్ బాషా, ఎం ప్రతాప్, ఎస్.అక్బర్, సి.మల్లికార్జున, ఎస్.నాగేంద్ర, ఎం.గురువర్ధన్, ఎస్.రజాక్, కె.వి.శివకుమార్, బి.కిషోర్, బి.శివ, టి.లింగ, బి.జై రామ్, ఎన్.రాజు, బి.హుస్సేన్, పి.సురేంద్ర, పి.నాగరాజు ఎంపికయ్యారు. స్టాండ్ బైలుగా బి.మల్లి ఎంపికైనట్లు తెలిపారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం : వైసిపి

ప్రజాశక్తి - కడప : రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం రైతులను ఏమాత్రం ఆదుకోలేదని, రైతులను దగా చేసే ప్రభుత్వంగా మారిందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, కడప నగర మేయర్ సురేష్ బాబు విమర్శించారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో అన్నదాతలకు అండగా వైసిపి కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలన్నారు. సూపర్ సిక్స్ హామీలను తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు. దళారీ వ్యవస్థను తొలగించాలన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. తేమ లెక్కలతో రైతులను ఇబ్బందికి పెట్టడం మానుకోవాలన్నారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలన్నారు. రైతుపై అదనపు భారం మోపే చర్యలను మానుకోవాలన్నారు. ఈ నెల 13వ తేదీన జరగనున్న అన్నదాతలకు అండగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి ర్యాలీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. తర్వాత కలెక్టర్కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, ఎల్లారెడ్డి, షఫీ, మాస్టర్ అహ్మద్, గౌస్ పాల్గొన్నారు.

ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న నేతలు

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విభజన హామీల్లో భాగంగా కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు కావాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ కోరారు. స్థానిక పాత బస్టాండులో బుధవారం పార్లమెంటులో కడప ఉక్కుపై కేంద్ర ఉక్కు శాఖ మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ చేనేత కార్మిక సంఘం నేతలు వినూత్న రీతిలో చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ కేంద్రం మరోమారు ఆంధ్ర ప్రజలకు, రాయలసీమ ప్రాంత ప్రజలకు, కడప జిల్లా ప్రజలకు చెవిలో పువ్వులు పెట్టిందని విమర్శించారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. దాన్ని దాటివేత ధోరణితో ఆ ప్రస్తావన లేదని పార్లమెంటులో మంత్రి కుమార్‌స్వామి మాట్లాడడం దారుణమన్నారు. కార్యక్రమంలో పల్లా లక్ష్మీనారాయణ, దాసు, ముని రామ్ శేఖర్, కొండయ్య పాల్గొన్నారు.

ఎస్‌సి ఉప వర్గీకరణపై సమాచార బోర్డు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయంలో షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై సమాచారాన్ని బోర్డులో ఏర్పాటు చేసినట్లు ఎంపిడీవో కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని కసనూరు సచివాలయంలో ఉప వర్గీకరణకు సంబంధించి సమాచార పత్రాన్ని అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ విచారణకు సంబంధించి విచారణ కమిషన్ కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేశారన్నారు. దీనికి సంబంధించి సంతకంతో కూడిన రాత పూర్వకంగా సూచనలు జనవరి 9లోగా అందజేయాల్సి ఉందన్నారు. రిజిస్టర్ పోస్టు ద్వారా, మెయిల్ ద్వారా గాని సమాచారం పంపవచ్చన్నారు.

నేటి నుంచి ప్రజాప్రతినిధులకు శిక్షణ

ప్రజాశక్తి - చాపాడు

స్థానికరణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు ఎంపిక చేసుకొని గ్రామాల పురోభివృద్ధికి కృషి చేసేందుకు సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు గురువారం నుంచి రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ వీర కిషోర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఉంటుందన్నారు. సిబ్బంది, ప్రజాప్రతినిధులు శిక్షణకు తప్పక హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

బహుమతులు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

విభిన్నప్రతిభావంతులను చిన్నచూపు చూడొద్దు

ప్రజాశక్తి - చక్రాయపేట

విభిన్నప్రతిభావంతులను చిన్నచూపు చూడవద్దని నాగలగట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. నాగలగట్టు పల్లె భవిత సెంటర్లో బుధవారం 65వ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రధానోపాధ్యాయుడు, ఎస్.నాగలగట్టుపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబా ఫకృద్దీన్ పాల్గొన్నారు. ఐఇఆర్‌టి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈనెల 5న జిల్లాస్థాయిలో జరిగిన ఆటలు పోటీల్లో ముగ్గురు సిడబ్ల్యుఎస్ఎన్ విద్యార్థులు ఆరీఫ్, మైథిలి, ఈశ్వరమ్మకు మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఐఇఆర్‌టిలు ఫిజియోథెరపిస్టులకు 50 మందికి, సిడబ్ల్యుఎస్ఎన్ విద్యార్థులకు అలవెన్సులు అందజేశారు. కార్యక్రమంలో ఐఇఆర్టీలు సత్యనారాయణ, లలిత, ఫిజియోథెరపిస్ట్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ట్రస్ట్ సభ్యులు

సరస్వతి విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి - లింగాల

దాతల సహకారంతో పెద్దకుడాల హైస్కూలో బుధవారం సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన పెద్దమళ్ల నారాయణరెడ్డి(కొండయ్యగారి) ట్రస్టు సభ్యులు కీర్తి శేషులు పెద్దమళ్ల లక్ష్మినరసమ్మ జ్ఞాపకార్థంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని ఆళ్లగడ్డలో ప్రత్యేకంగా తయారు చేయించామని నిర్వాహకులు చంద్రహాస్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

గత ఏడాది పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థి బ్రహ్మణపల్లె అంజలికి లాప్‌ట్యాప్, రెండవ బహుమతి కాకార్ల మంజునాథరెడ్డి ట్యాబ్, మూడవ బహుమతి సారెడ్డి సబితారెడ్డి స్మార్ట్‌ఫోన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంధుల ఆశ్రమంలో అన్నదానం

పులివెందుల రూరల్ : స్థానిక కచేరీ రోడ్డు శ్రీవీర అంధుల ఆశ్రమంలో మంజుల ప్రమీల రెండవ వర్ధంతి సందర్భంగా ఆమె భర్త కుళ్లాయప్ప, పెద్ద కుమారుడు నాగమునీంద్ర, పెద్ద కోడలు సుష్మ, చిన్న కుమారుడు కులశేఖర, కుటుంబ సభ్యులచే అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు అనిమేల రామమోహన్ పాల్గొన్నారు.

వరి నూర్పిడి పనులు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

వరి పంట నూర్పిడి చేసే రైతులు మూడు రోజులపాటు పనులను వాయిదా వేసుకోవాలని ఎఒ మ్యాగీ తెలిపారు. చిన్నగురువలూరు, కుచ్చుపాప గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. వరి నూర్పిడి చేసి ఉంటే టార్పలిన్ పట్టలతో కప్పి ఉంచాలన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ బిఎస్ క్రాంతిశ్రీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. వివరాలకు వనిపెంట కెవికె వద్దకు రావాలన్నారు. విఏఏ మాధవి లత, కిసాన్ బీమా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా పత్తూరు

ప్రజాశక్తి - ఖాజీపేట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీల అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రత్యేక ఆర్థిక సంఘం నిధులను కేటాయిస్తుంటాయి. దీంతోపాటు ఆయా పంచాయతీలకు స్థానిక పన్నుల ద్వారా కూడా ఆదాయం సమకూరుతుంటుంది. మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తున్నామని గొప్పగా ప్రచారం చేసుకుంటున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలు అలాగే ఉన్నాయి. ఇప్పటికీ పలు గ్రామాల్లో రహదారులు, డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా అధ్వానంగా ఉంటున్నాయి. మౌలిక సదుపాయాలు ఏమాత్రం సమకూరడం లేదని గ్రామీణులు వాపోతున్నారు. వివరాల్లోకెళితే.. మండల పరిధిలోని పత్తూరు పంచాయతీ గ్రామం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఆయా వీధులలో సరైన సిమెంట్ రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సిమెంట్ రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. ప్రజల అవసరాలకు సరిపడిన అన్ని రోడ్లు మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్నపాటి వర్షం వస్తే మురుగు రోడ్డుపై ప్రవహిస్తూ ఉంటుంది. మురుగునీరు రోజుల తరబడి నిలువ చేరి ఉంటోంది. దీంతో దోమల బెడదతోపాటు దుర్వాసనను భరించలేకున్నామని ప్రజలు వాపోతున్నారు. వర్షాల సమయంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా, అంటువ్యాధులు ప్రబలకుండా కనీసం రసాయనాలను చల్లే చర్యలు కూడా చేపట్టడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి తగినన్ని సిమెంట్ రోడ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పత్తూరు వీధిలో నిలిచి ఉన్న మురుగు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

ప్రజాశక్తి - ముద్దనూరు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ సాయిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని వేల్పుచెర్ల గ్రామంలో బుధవారం తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. సదస్సును జమ్మలమడుగు ఆర్‌డిఒ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సదస్సుకు ముందు రోజు రెవెన్యూ అధికారులు 1బి అందజేశారా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాలకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు సదస్సులో అందుబాటులో ఉంటాయని, రైతులు పరిశీలించుకోవచ్చన్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్టర్, ఆర్ఐ సుజిత్, సర్వేయర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం చూపిస్తాం

చాపాడు : రైతుల నుంచి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని తహశీల్దార్ రమాకుమారి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలు ఉన్న రైతులు సమావేశాలకు వచ్చి అర్జీ ఇవ్వాలన్నారు. అర్జీ ఇచ్చిన ప్రతి రైతుకు రసీదు ఇచ్చి పరిష్కారం చూపుతామన్నారు. ప్రజల నుంచి 53 సమస్యలకు సంబంధించి అర్జీలు సభ దృష్టికి వచ్చాయి. కార్యక్రమంలో డిటి కృష్ణారెడ్డి, రీసర్వే డిటి నారాయణ స్వామి, ఆర్ఐ చంద్రశేఖర్‌రెడ్డి, సర్వేయర్ లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు రామాంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, విఆర్‌ఒలు రాజశేఖర్‌రెడ్డి, ఇస్మాయిల్, ప్రొద్దుటూరు శివాలయం మాజీ చైర్మన్ పల్లా శంకర్ నారాయణ, రైతులు పాల్గొన్నారు.

ఖాజీపేట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసు కోవాలని తహశీల్దార్ మహబూబ్ బాషా, టీడీపీ మండల సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి కోరారు. మండల పరిధిలోని తవ్వారుపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను 45 రోజుల్లో పరిష్కరిస్తారిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మంచి ధర లభించేందుకే ఇ-నామ్ వ్యవస్థ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పంట దిగుబడులకు మంచి ధర లభించేందుకే ఇ- నామ్ వ్యవస్థ ఉపయోగపడుతుందని ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకులు సి.రామాంజనేయులు తెలిపారు. పులివెందుల మార్కెట్ యార్డ్ ఆవరణలో చీనీ కాయల క్రయవిక్రయాలలో ఇ-నామ్ వ్యవస్థ అమలు చేసేందుకు రైతులు, వ్యాపారులు, రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సి.రామాంజనేయులు మాట్లాడుతూ ఇ-నామ్ వ్యవస్థలో రైతులు, వ్యాపారులు ఆన్‌లైన్ వివరాలు నమోదు చేసుకుని ఉంటారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న మార్కెట్లలోని ధరలు చూసుకునే వీలు ఉంటుందన్నారు. ఇందులో ఎలాంటి మోసాలకు అవకాశం ఉండదని తెలిపారు. పులివెందుల చీనీకాయల మార్కెట్‌లో కూడా ఇ-నామ్ వ్యవస్థ నిర్వహించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. ప్రాంతీయ ఉప మార్కెటింగ్ సంచాలకులు బి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పంట దిగుబడులు క్రయవిక్రయాలకు ఇ-నామ్ వ్యవస్థ ఎంతగానో లాభదాయకంగా ఉంటుందని వివరించారు. జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఆజాద్ వలి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి వి.శ్రీధర్‌రెడ్డి, పర్యవేక్షకులు రామకృష్ణ, సహాయ మార్కెట్ పర్యవేక్షకులు అరుణ్ కుమార్, లావణ్య, నాయుడు, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ట్రిపుల్ఐటి డైరెక్టర్‌తో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ నాగరాజు

ఆహారం మారడంతోనే విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి - వేంపల్లె

ట్రిపుల్ఐటిలో ఫుడ్ పాయిజన్ కాలేదని, ఆహారం మారడం వల్ల కొంత మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ చిన్నయ్య పేర్కొన్నారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ వార్త పత్రికల్లో రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ఐటిలను డిఎంహెచ్ఒ నాగరాజు, ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ చిన్నయ్య సందర్శించారు. ఈ సందర్భంగా అయిదు రోజులుగా జరిగిన ఓపికి చెందిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను కలిసి భోజనానికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇచ్చిన సమాచారం మేరకు ఆహారంలో ఎలాంటి కలుషితం కాలేదన్నారు. ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ఐటీల్లో 8,600 మంది విద్యార్థులు ఉన్నారని, వీరిలో 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని పత్రికల్లో వచ్చిందన్నారు. ఈనెల 6నుంచి 10వ తేదీ వరకు 33 మంది విద్యార్థులు వివిధ కంప్లయింట్లతో ఆస్పత్రికి వచ్చారన్నారు. ఒంగోలు ట్రిపుల్ఐటిలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు ఆయా ప్రాంతాల్లో నుండి వచ్చిన వారు కావడంతో వారి నుంచి కంప్లయింట్లు వస్తున్నాయన్నారు. అక్కడి ఆహారానికి ఇక్కడి ఆహారానికి తేడా ఉండడంతో అడ్జస్ట్ కాలేకపోయారని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ హరినాథ్ రెడ్డి, అసిస్టెంట్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఖాజామొద్దీన్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, డాక్టర్ రాఘవేంద్ర రాజు, అధికారులు పాల్గొన్నారు.

కొనిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహిత్య పురస్కారాలు

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో కథా పురస్కారం (2023-2024), వచన కవితా పురస్కారం (2022-2023-2024) బాల సాహిత్య పురస్కారం (2023-2024) సంవత్సరాల్లో ప్రచురించబడిన పుస్తకాలకు అందజేయనున్నట్లు సంస్థ అధ్యక్షులు కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి, కె.హర్షవర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి విభాగంలో రెండు పుస్త కాలను ఎంపిక చేసి ఆ రచయితలకు ఒకొక్కరికి రూ.6,000 నగదు, శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సన్మానిస్తామన్నారు. న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన రచయితకు గౌరవ సన్మానం ఉంటుందన్నారు. రచయితల నుండి పుస్తకాలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఒక్కో శీర్షికకు మూడు ప్రతుల చొప్పున పుస్తకాలను పంపాల్సిందిగా కోరారు. రాష్ట్రేతర, ఉభయ తెలుగు రాష్ట్రాల కవులు, రచయితలు పుస్తకాలు పంపవచ్చు. పుస్తకా లతో పాటు రచయితలు ఎ4 సైజులో బయోడేటా టైప్ చేసి పంపించాలన్నారు.

చుక్కల భూములపై వైసిపి వినతి

ప్రజాశక్తి - ఖాజీపేట

రైతులు చుక్కల భూముల సమస్యలను ఎదుర్కొంటున్నారని, వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, అగ్రహార సహకార సంఘం మాజీ అధ్యక్షులు పీవీ రాఘవరెడ్డి రెవెన్యూ అధికారులను కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం వారు తహశీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం సమర్పించారు. మండల వ్యాప్తంగా దాదాపు నాలుగు వేల ఎకరాల్లో చుక్కల భూములున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కూనవారిపల్లె సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి, గుత్తి కొట్టాలు వేమారెడ్డి, ఏటూరు శివారెడ్డి, రావులపల్లి మధు పాల్గొన్నారు.

సూక్ష్మ పోషకాలూ ముఖ్యమే

ప్రజాశక్తి - దువ్వూరు

పంటలకు సూక్ష్మ పోషకాలు కూడా ముఖ్యమని ఎఒ అమర్‌నాథ్‌రెడ్డి, మహాధన్ అగ్రిటెక్ లిమిటెడ్ రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి సాంబశివరావు సూచించారు. చిన్న సింగన్నపల్లెలో బుధ వారం మహాధన్ అగ్రిటెక్ లిమిటెడ్ వారు రైతులకు అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు సాగు చేసే సమయంలో వివిధ రకాల ఎరువులు వాడుతుంటారని, అలా ఎక్కువ మోతాదులో పంటకు ఎరువులు వాడడం వల్ల భూమిలో సారవంతం తగ్గుతుందని తెలిపారు. మహాధన్ అగ్రిటెక్ లిమిటెడ్ కడప జిల్లా ఇన్‌ఛార్జి జనార్ధన్, మార్కెటింగ్ ఇన్‌ఛార్జి రాఘవేంద్ర, కాశిరెడ్డి నాయన ట్రేడర్స్ యజమాని పల్లె నాగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ట్రిపుల్ఐటి సమస్యల్ని లోకేష్ దృష్టికి తీసుకెళ్తా

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ ట్రిపుల్ఐటిలో ఉన్న సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమెల్సీ రాంగోపాల్ రెడ్డి అన్నారు. స్థానిక టిడిపినేత వేమిరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను బుధవారం ఆయన పరామర్శించారు. వేమిరెడ్డి కృష్ణారెడ్డి తండ్రి మల్లారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మల్లారెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇడుపులపాయ ట్రిపుల్ఐటి క్యాంపస్‌లోని ఓల్డ్ క్యాంపస్ ఉన్న విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన విషయం తెలిసిందన్నారు. అధికారులు కూడా ఇలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. వేంపల్లె బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులు ఉండి విద్యార్థులకు చదువు చెప్పకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే ట్రిపుల్ఐటి సమస్యలను విద్యా శాఖ మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మరోసారి తీసుకెళతానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జివి రమణ, డివి సుబ్బారెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, టిడిపి నేతలు పాల్గొన్నారు.

అర్బన్ సిఐని కలిసిన ఇనయితుల్లా

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణ అర్బన్ సిఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నరసింహులును బుధవారం స్థానిక ఇస్లాంపురం వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ఇనయితుల్లా మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జిలాని పాల్గొన్నారు.

సిఐని సన్మానిస్తున్న ఇనయితుల్లా

మధ్యాహ్న భోజన బిల్లుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మధ్యాహ్నం భోజనం బిల్లుల బకాయిలు చెల్లించాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె) పట్టణ అధ్యక్షుడు హుస్సేన్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నాలుగు నెలల బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. బిల్లులతోపాటు గౌరవ వేతనాలు కూడా అందలేదని తెలిపారు. గౌరవ వేతనం నెలకు కేవలం రూ.3 వేలు చెల్లించడం అన్యాయమన్నారు. జిల్లా అధికారులు తక్షణం స్పందించి బిల్లులు చెల్లించి వారిని ఆదుకోవాలని కోరారు.

జమిలి ఎన్నికల నిర్ణయం సరైందికాదు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జమిలి ఎన్నికల నిర్ణయం సరైంది కాదని, సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువకుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జమిలి ఎన్నికలు దేశానికి అనవసరమన్నారు. ఆచరణ సాధ్యం కాదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అభివృద్ధికి అడ్డు వస్తోందనడంలో వాస్తవం లేదన్నారు. జగన్ పాలనలో పేదల ఇళ్ల నిర్మాణం నత్త నడకన సాగితే.. చంద్రబాబు పాలనలో పడకేసిందని విమర్శించారు. సమావేశంలో పులివెందుల మండలశాఖ అధ్యక్షులు అనిల్ కుమార్‌రెడ్డి, లింగాల అధ్యక్షులు శంకర్‌రెడ్డి, తొండూరు అధ్యక్షులు వినోద్ కుమార్‌రెడ్డి, పులివెందుల నియోజకవర్గ నాయకులు జయచంద్రారెడ్డి, తూపల్లి రాజారెడ్డి, ఘోస్, అవినాష్, సాయి, అమర్, రాజు పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపులో జాప్యం : యుటిఎఫ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల చెల్లింపులో జాప్యం మేలా అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు ప్రశ్నించారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రాంతీయ మండలాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలన్నింటినీ ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలైనా ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం తగదన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకుండా వేధింపులకు గురి చేసిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఏపీజిఎల్ఐ సొమ్ములను సైతం చెల్లించకుండా ప్రభుత్వం తమ అవసరాలకు మళ్లించుకుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం సైతం ఉద్యోగుల విషయంలో గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తుండడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్.నాగార్జున రెడ్డి, సహాధ్యక్షులు డి.సుజాత రాణి, జిల్లా కార్యదర్శి వి.మురళీకృష్ణ, నాయకులు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బి.లక్ష్మీరాజా

ప్రకటన

కడప జిల్లా ఖాజీపేట మండలం ఆంజనేయపురం H/O చెన్నముక్కపల్లె గ్రామంలోని శ్రీ పెన్నా ఆంజనేయస్వామి దేవస్థానమును దేవాదాయ చట్టం 30/87 ప్రకారము రిజిస్ట్రేషన్ మరియు పబ్లికేషన్ చేయదలచినాము. దీనిపై ఎవరికైనా అభ్యంతరములు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన 10 రోజులలో కడపజిల్లా దేవాదాయశాఖ జిల్లా అధికారి గారికి వ్రాతపూర్వకంగా అభ్యంతరములు తెలియజేయగలరని శ్రీ సి.శివయ్య, ఇన్‌స్పెక్టర్ దేవాదాయశాఖ కడప వారు తెలియజేయడమైనది.

ఇట్లు :
పొట్టిపాటి భాస్కర్ రెడ్డి
ఆలయ ధర్మకర్త,
సెల్ నెం:9000715909

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, KADAPA
H.M.O. P.No.39 /2024

కుంచు లక్ష్మిదేవి, W/o కుంచపు గురప్ప, హిందూ హౌస్ వైఫ్, వయస్సు సుమారుగా 35 సంవత్సరాలు, నివాసం D.No.3/267, రామాంజనేయపురం, కడప సిటీ & జిల్లా. ...పిటిషనర్

Vs

కుంచపు గురప్ప S/o. వెంకటయ్య, హిందువు, సుమారు 42 సంవత్సరాల వయస్సు, సుంకేసుల గ్రామ నివాసి. ఖాజీపేట మండలం, కడప జిల్లా. ...రెస్పాండెంట్

నోటీసు

పై కేసులోని పిటిషనర్ మీతో ఆమెకు జరిగిన వివాహంను రద్దు పరచి విడాకులు కోరుతూ పై నెంబర్ కేసు ను దాఖాలు చేసినందున ఇందు విషయమై మీకు ఆక్షేపణ యున్నాయెడల పైకోర్టులో 20.12.2024వతేదిన ఉదయం 10.30 ని॥లకు కుద్దున గాని, వకీలు ద్వార గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోనవలెను,లేని ఎడల సదరు విషయమై పరోక్షముగా విచారించి తీర్మాణము చేయుదరని తెలియజేయడమైనది.

వాయిదా : 20.12.2024

//కోర్ట్ వారి ఉత్తర్వు మేరకు//
టి.సి.ఖాదరయ్య
పిటిషనర్ తరుపున న్యాయవాది, కడప.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 352/2016

ఎల్. రవి, S/o పురుషోత్తం, 27సం॥లు, క్రిష్టియన్, డోర్ నెం. 25/531, మట్టి మజీద్‌వీధి, వసంతపేట, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. ...వాది

Vs

2. కె.ఖదిరున్, W/o లేట్ జాకీర్ హుస్సేన్, 52 సం॥లు,
3. కె.కరిష్మా, D/o లేట్ జాకీర్ హుస్సేన్, 35 సం॥లు,
4. కె.ఇక్బాల్, S/o లేట్ జాకీర్ హుస్సేన్, 32 సం॥లు,
సాకిన్ నెం. 2to 4 అందరూ డోర్‌నెం. 2/1049, ఐస్ ఫ్యాక్టరీ వీధి, నాగరాజుపేట, కడప సిటీ మరియు జిల్లా. ...2 to 4వ ప్రతివాదులు

దావా సమను

పై నెంబరు దావాను 1వ ప్రతివాది (పోతి) వ్రాయించి ఇచ్చిన 31.03.2016వ తేదీన గల విక్రయ అగ్రిమెంటు ప్రకారం రిజిష్టరు చేయించనందున దావా దాఖలు చేసి ఉంటున్నారు. అట్టి దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో 23.12.24వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టులో తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 23/12/2024

//By Order of the Court//
G. SRINIVASULU
B.Com.,B.L.,
Advocate, PRODDATUR.

మహారాజశ్రీ కర్నూలు 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో
M.V.O.P. No. 264/2023

షేక్‌షబానా వగైరా ..... అర్జిదారులు

V/s

R. సుదర్శన్ వగైరా ..... రెస్పాండెంట్లు

3వ రెస్పాండెంటుకు నోటీసు

R. నరేష్ S/o. R. సుదర్శన్ Bolero Pickup Driver No. AP-39-UC-1297; H.No. 3/154, పాతకొండాపురం గ్రామము, కడప జిల్లా. పై నెంబర్ M.V.O.P.లో షేక్‌షావలి. 08-08-2023 తేదీన రోడ్డు ప్రమాదములో చనిపోయినాడని అతనికి నష్టపరిహారంగా రూ. 15,000,00/- లు మరియు అర్జిదాఖలు చేసిన రోజు నుండి 12% P.A. ప్రకారము, వడ్డీతో మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని అర్జిదాఖలు చేసినారు. ఇందులో 3వ, రెస్పాండెంటు అయిననీకు ఆక్షేపణ ఉన్న 26-12-2024 తేదీన పగలు. 10-30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు
వి. నాగలక్ష్మిదేవి
అర్జిదారులుపరం అడ్వకేటు,
కర్నూలు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 385/2011

1. జి.సీతారామిరెడ్డి, S/o రామిరెడ్డి, 50 సం॥లు, డోర్‌నెం. 24/574, వసంతపేట.
2. జి.క్రిష్ణ, S/o జి.వీరయ్య, 33 సం॥లు, 8/405, స్వయం సేవక్ రోడ్డు.

సాకిన్ అందరూ ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, కడప జిల్లా. ...వాదులు

Vs

8. యు.నరేంద్ర, S/o లేట్ సుబ్బరామయ్య, 35 సం॥లు,
9. యు.లత, D/o లేట్ సుబ్బరామయ్య, 33 సం॥లు,
10. యు.సునీత, D/o లేట్ సుబ్బరామయ్య, 30 సం॥లు,
సాకిన్ నెం. 8to10 అందరూ డి-బ్లాక్, PDTWMA న్యూ కలెక్టరేట్, కడప సిటి మరియు జిల్లా. ...8 to 10వప్రతివాదులు

దావా సమను

పై నెంబరు దావాను 8 to 10వ ప్రతివాదులు అయిన మీ పైన మరియు మరికొంత మందిపైన దావా షెడ్యూల్ దాఖల ఆస్థిని Declare the right and title కోరి దాఖలు చేసి ఉంటున్నారు. అట్టి దావాలో మీరు హాజరు అగుటకుగానూ 19.12.2024వ తేదీన వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా నాడు ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 19/12/2024

//By Order of the Court//
G. SRINIVASULU
B.Com.,B.L.,
Advocate, PRODDATUR.